





భవానీ ఐల్యాండ్, బెర్మ్‌పార్క్ తాకట్టు..!

గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేట్ బ్యాంక్ నుంచి రుణం

- రూ. 15 కోట్ల రుణం తీసుకున్న ఏపీటీడీసీ
- కాటేజీలు, హోటళ్ల ఆధునికీకరణకు టెండర్లు
- పనులు పూర్తిచేశాక నిర్వహణ ప్రైవేటుకు..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవానీ ఐల్యాండ్, హరిత బెర్మ్‌పార్కును ఏపీటీడీసీ ఉన్నతాధికారులు తాకట్టు పెట్టారు. ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.15 కోట్లకు తాకట్టు పెట్టిన విషయం తాజాగా వెలుగుచూసింది. తెరవెనుక తాకట్టు ప్రతిపాదనలు జరుగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది.

తెరవెనుక కుట్రలు

పర్యాటకాభివృద్ధి సంస్థ ఆస్తులను తాకట్టు పెట్టడం, ప్రైవేటీకరించడం ఏకకాలంలో ప్రారంభించారు. దీనికోసం కొత్త ఎత్తుగడ వేశారు. పర్యాటక యూనిట్లను గంపగుత్తగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలిచారు. ఆయా పర్యాటక యూనిట్ల లోని కాటేజీలు, రెస్టారెంట్లకు సంబంధించిన పునరుద్ధరణ పనుల కోసం టెండర్లు పిలిచారు. దీనిని బట్టి చూస్తే ఏపీటీడీసీ ఉన్నతాధికారుల మైండ్‌గేమ్ ఏమిటో అర్థమవుతుంది. ఏపీటీడీసీ ఆస్తులను అభివృద్ధి చేయటానికి తాకట్టు పెట్టినపుడు ఆ పనులను ఆ సంస్థే చేపట్టాలి. మరి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించటం ఏమిటనేదే ప్రశ్న. హరిత బెర్మ్‌పార్క్, భవానీ ఐల్యాండ్‌కు ఏడాదికి రూ.10 కోట్ల ఆదాయం వస్తుంది. కానీ, ఏడాదికి రూ.4 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేలా టెండర్లు పిలిచారు. రూ.6 కోట్ల నష్టం వాటిల్లుతున్నపుడు చేసిన అప్పులు ఎలా తీరుస్తారు..? ఈ విషయం రుణం ఇచ్చిన ప్రైవేట్ బ్యాంకుకు తెలుసో లేదో తెలియదు కానీ, ఒకవేళ ఏపీటీడీసీ రుణం చెల్లించడంలో విఫలమైతే నష్టపోయేది సదరు బ్యాంకే. కాగా, ఏపీటీడీసీ తాకట్టు ప్రతిపాదనలకు జాతీయ బ్యాంకులు రుణం ఇవ్వటానికి అంగీకరించకపోవడంతో ప్రైవేట్ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.15 కోట్ల రుణం తెచ్చినట్టు తెలిసింది.

ప్రైవేటుకు ఎందుకు..?

హరిత బెర్మ్‌పార్క్, భవానీ ద్వీపాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడానికి ఏపీటీడీసీ టెండర్లు పిలిచింది. సదరు ప్రైవేట్ సంస్థలు తమకు అప్పగించిన పర్యాటక యూనిట్లను తమ సొంత ఖర్చుతో అభివృద్ధి చేసుకోవాలి. రీ మోడలింగ్ వంటివి చూసుకోవాలి. ఇలాంటపుడు కాటేజీలను, రెస్టారెంట్లను అభివృద్ధి చేయడానికి రూ.కోట్లు అప్పు తీసుకోవడం ఎందుకో తెలియని పరిస్థితి.

ఆదాయం ఎక్కువ.. లీజు తక్కువ..

భవానీ ద్వీపం, హరిత బెర్మ్‌పార్కుకు ఏటా రూ.10 కోట్ల ఆదాయం వస్తోంది. అలాంటి యూనిట్లను రూ.4 కోట్లకే కట్టబెట్టేస్తున్నారు. దీనివెనుక ఏపీటీడీసీ ఉన్నతాధికారులకు భారీగా వాటాలు ఇచ్చేలా తెరచాటు ఒప్పందాలు జరిగాయని తెలుస్తోంది. ప్రైవేట్ సంస్థల్లో అనధికారికంగా ఉన్నతాధికారులకు వాటాలు ఉన్నట్టు కూడా ఆరోపణలు వస్తున్నాయి.



బ్రహ్మరథం

రమణీయం.. ఆది దంపతుల రథోత్సవం

భక్తుల జయజయధ్వానాలతో మార్మోగిన కెనాల్‌రోడ్డు

నందీశ్వరుడు ధ్వజమై ఎగరగా, చండీశ్వరుడు ముందుండి నడవగా, ప్రమద గణాలు పాంచజన్యాలు పూరించగా కెనాల్‌రోడ్డులో శనివారం సాయం సంధ్యవేళ ఆది దంపతుల రథోత్సవం అత్యంత రమణీయంగా సాగింది.

వన్‌టౌన్, మార్చి 9 : కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కెనాల్ రోడ్డులో రథోత్సవం కనులపండువగా జరిగింది. దుర్గగుడి నుంచి గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి, పాతశివాలయం నుంచి భ్రమరాంబ, మల్లిఖార్జునస్వామి, భద్రకాళి, వీరభద్రస్వామి, బుద్దువారి గుడి నుంచి గంగ, పార్వతి, వసంత మల్లిఖార్జునస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలోని పీఠంపై అధిష్ఠింపజేశారు. అనంతరం దుర్గగుడి స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాదశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు. హారతులు సమర్పించిన అనంతరం పోలీసు కమిషనర్ కాంతిరాణా కొబ్బరికాయ కొట్టగా, రథం ముందుకు కదిలింది. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, ఈఈ రమాదేవి, పాత శివాలయం ఈవో లోకేశ్వరి, బుద్దువారి గుడి ఈవో ఘంటసాల శ్రీనివాస్‌తో పాటు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైసీపీ సమన్వయకర్త షేక్ ఆసిఫ్, జనసేన పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ పాల్గొన్నారు. డీసీపీలు అధిరాజ్‌సింగ్ రాణా, శ్రీనివాసరావు, కె.చక్రవర్తి, టి.హరికృష్ణ, ఏడీసీపీలు టి.నాగరాజు, డి.ప్రసాద్, శ్రీహరిబాబు, వన్‌టౌన్ సీఐ ధనశేఖర్‌రెడ్డితో పాటు పలు స్టేషన్లకు చెందిన సీఐలు పాల్గొన్నారు. కోలాటాలు, డప్పు వాయిద్యాలు, బేతాళ వేషధారులు, సంప్రదాయ భజనలు రథానికి ముందు సందడి చేయగా, కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్దకు వెళ్లిన రథం తిరిగి మళ్లీ రథం సెంటర్‌కు చేరుకుంది.

ప్రాధాన్యమేదీ..?

జిల్లాలో ధాన్యం బకాయిలు రూ.290 కోట్లకు పైనే..



కుప్పలపై ఉన్న ధాన్యం

రైతులు పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తారా లేక నిలిపివేస్తారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం మినుముతీత పనులు జరుగుతుండగా, వాటితో పాటే కుప్పనూర్పిళ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలుపై అధికారులు పూర్తిగా సంసిద్ధంగా లేకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. మరోవైపు ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం రెండు నెలలుగా బిల్లులను చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తుండటంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు.

- సంక్రాంతి తరువాత నుంచి బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- తాజాగా కుప్పనూర్పిళ్లు వేగవంతం
- పూర్తిస్థాయిలో ధాన్యం కొంటారో లేదోనని రైతుల్లో సందిగ్ధం
- ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్న దైన్యం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ప్రభుత్వం ద్వారా ఇప్పటివరకు 4.90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో 1.40 లక్షల టన్నులకు పైగా ధాన్యం బిల్లులను రెండు నెలలుగా చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. రబీ సీజన్‌లో రెండో పైరుగా సాగుచేసిన మినుముతీత పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తయితే ఈ నెలాఖరులోపు కుప్పనూర్పిడి పనులను రైతులు పూర్తిచేస్తారు. కీలకమైన ఈ సమయంలో ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు జాప్యం చేస్తుండటంతో రైతుల్లో అయోమయం నెలకొంది.

ఆఫ్‌లైన్‌లో విక్రయించిన ధాన్యం ఊసెత్తని అధికారులు

జిల్లాలో డిసెంబరు, జనవరిలో 45 వేల టన్నుల ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొన్నారు. ఈ ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసి బిల్లులు రైతులకు చెల్లించాల్సి ఉంది. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా జాప్యం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసినట్లుగా లెక్కల్లోకి రాని ఈ ధాన్యం బిల్లులను ఎలా చెల్లిస్తారనే అంశంపై రైతుల్లో గందరగోళం నెలకొంది. గత ఏడాది ఆఫ్‌లైన్‌లో విక్రయించిన ధాన్యానికి బిల్లులు చెల్లించకుండా మూడు నెలలకు పైగా జాప్యం చేశారు. రైతులు పదేపదే కలెక్టరేట్ చుట్టూ తిరిగి, రాస్తారోకోలు, ఆందోళనలు చేస్తే అధికారులు మిల్లర్లతో మాట్లాడి బస్తాకు రూ.1,350 చొప్పున చెల్లించేలా ఒప్పందం కుదిర్చారు. మిల్లర్లు మరింత ఆలస్యం చేసి నగదును అతికష్టం మీద రైతులకు అందజేశారు. ఈ ఏడాది ఆఫ్‌లైన్‌లో విక్రయించిన ధాన్యం బిల్లులను ఏ రూపంలో, ఎంత ధర నిర్ణయించి చెల్లింపులు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ధాన్యం కొనుగోలుపై అనుమానాలెన్నో..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 10.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటివరకు 4.90 లక్షల టన్నులే కొన్నారు. ప్రస్తుతం కుప్పనూర్పిళ్లు జరుగుతుండగా, మరో వారంలో మరింత వేగవంతమవుతాయి. జిల్లాలో ఇంకా 2 లక్షల టన్నులకుపైగా ధాన్యం ప్రభుత్వం కొనాల్సి ఉంది. ఇప్పటికే తహసీల్దార్లు, ధాన్యం కొనుగోలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో భాగంగా శిక్షణా తరగతులకు హాజరవుతున్నారు. మరో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే అధికారులంతా ఆ విధుల్లో నిమగ్నమవుతారు. ఈ నేపథ్యంలో ఈ ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసే అంశంలో అనేక ఇబ్బందులు ఎదురవడం ఖాయం. జిల్లాలో 301 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మలివిడతగా ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతూనే, 50 వేల టన్నులకు మించి కొనేది లేదని, ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయించుకోవాలని రైతులకు చెప్పకనే చెబుతున్నారు.

ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లోకి..

ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో రైతులు స్థానికంగా ఉన్న ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తాకు రూ.1,634 వరకు రావాల్సి ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం నాణ్యతతో సంబంధం లేకుండా బస్తాకు రూ.1,500 నుంచి 1,530 వరకు ధర చెల్లిస్తున్నారు. చెన్నై, హైదరాబాద్, మండపేట, చిత్తూరు తదితర ప్రాంతాలకు చెందిన ధాన్యం వ్యాపారులు జిల్లాకు వచ్చి, స్థానికంగా ఉన్న మధ్యవర్తుల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొంటున్నారు. బస్తాకు రూ.100 మద్దతు ధర తక్కువగా వచ్చినా రైతులు ప్రైవేట్ వ్యాపారుల నుంచి నగదుకు సంబంధించి హామీ తీసుకుని ధాన్యం విక్రయించేస్తున్నారు. కుప్పనూర్పిడి చేసిన ధాన్యంలో తేమశాతం, ఇతరత్రాలకు సంబంధించిన ఇబ్బందులు పెద్దగా ఉండవు. దీంతో పూర్తిస్థాయి మద్దతు ధర రైతులకు వచ్చే వెసులుబాటు ఉంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తేనే పూర్తిస్థాయి మద్దతు ధర లభించే అవకాశముంది. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం మిన్నకుండిపోతోంది. రైతుల వద్ద ప్రస్తుతం ఉన్న రెండు లక్షల టన్నులకు పైగా ధాన్యం విక్రయిస్తే, మద్దతు ధర రూపంలో రూ.2 కోట్లకు పైగా రైతులు కోల్పోవాల్సి వస్తుంది. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు జిల్లా నుంచి ధాన్యం కొని తీసుకుపోతుండటంతో జిల్లాలోని 170 మిల్లులకు ధాన్యం రాని స్థితి నెలకొంది. ఇప్పటికే జిల్లా నుంచి 4వేల లారీల ధాన్యం ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొని తీసుకెళ్లిపోతున్నారు.

వారంలో ధాన్యం బిల్లులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నాం. రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలు మరో వారంలో విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొంటాం.

- తోట సతీష్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్



అధైర్యమొద్దు.. అండగా ఉంటా..

ఇందిరమ్మ అభయం యాప్‌ను ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో శనివారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆవిష్కరించారు. అనంతరం స్థానిక మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టేబోయే సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు.

- 6లో..

అంతా రహస్యంపై గుంటూరులో విచారణ

కేసు వర్కర్ స్థానికతను పరిశీలించాలని నిర్ణయం

- గుంటూరులో పనిచేసే కేసు వర్కర్‌కు ఎన్టీఆర్ జిల్లాలో పోస్టింగ్
- ఎన్టీఆర్ జిల్లాకు చెందిన స్థానికులకు అన్యాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో పనిచేయటానికి కాంట్రాక్టు పద్ధతిలో చేపట్టే సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ పోస్టు భర్తీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో గుంటూరు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అప్రమత్తమైంది. 'అంతా రహస్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు అంతర్గత విచారణ ప్రారంభించారు. స్థానికత ఆధారంగానే ఆ మహిళను గుంటూరు జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న దిశ వన్‌స్టాప్ సెంటర్‌కు కేసు వర్కర్‌గా ఎంపిక చేశారు. ఇదే మహిళ ఎన్టీఆర్ జిల్లాలోనూ స్థానికురాలంటూ ఏకంగా సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుకు ఎంపిక చేయటంపై వివాదం అలుముకుంది. బాధితులు కోర్టును ఆశ్రయించటానికి రంగం సిద్ధం చేస్తుండటంతో గుంటూరు జిల్లా అధికారులు కేసు వర్కర్ స్థానికత, ఇతర అర్హతల వివరాలు బయటకు తీస్తున్నారు. కేసు వర్కర్ స్థానికతకు సంబంధించిన ధ్రువపత్రాలు, మార్కుల మెమో, అనుభవం వంటి వివరాలను పరిశీలించాలని నిర్ణయించారు. కానీ, ఎన్టీఆర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మాత్రం ఎలాంటి విచారణా చేపట్టడం లేదు. కలెక్టర్ ఢిల్లీరావు చొరవ తీసుకుని థర్డ్‌పార్టీతో విచారణ జరిపించాలని బాధిత మహిళలు కోరుతున్నారు. కలెక్టర్‌ను కూడా తప్పుదారి పట్టించారని బాధితులు ఆరోపిస్తున్నారు. గుంటూరు జిల్లాలో అక్కడి స్థానికత ఆధారంగానే ఆ మహిళను కేసు వర్కర్‌గా తీసుకున్నారు. కానీ, ఎన్టీఆర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మాత్రం ఇక్కడి స్థానికత అన్న అంశాన్ని చర్చనీయాంశం చేస్తోంది. ఇంత వివాదం జరుగుతున్నా ఏదో ఒక రకంగా ఈ అంశం నుంచి బయటపడాలన్న ఆలోచన చేస్తుందే తప్ప, పారదర్శకంగా ఎంపిక చేశామన్నదానికి ఒక్క ఆధారం కూడా చూపించటం లేదు.

చదువుల తల్లి 'ఉజ్వల'



- ఆస్ట్రేలియాలో మృతిచెందిన తెలుగు వైద్యురాలు
- గన్నవరం చేరిన భౌతికకాయం
- విద్యానగర్‌లో విషాదఛాయలు

ఆస్ట్రేలియాలో ప్రమాదవశాత్తూ మృతిచెందిన వైద్యురాలు వేమూరు ఉజ్వల భౌతికకాయం శనివారం తన స్వస్థలం గన్నవరంలోని విద్యానగర్‌కు చేరింది. ఆమె భౌతికకాయాన్ని చూసిన బంధువుల ఆర్తనాదాలతో విద్యానగర్ కన్నీటిపర్యంతమైంది. వైద్యురాలిగా రోగులకు సేవలందించాలనే కల నెరవేరకుండానే ఉజ్వల విగతజీవిగా ఇంటికి చేరడాన్ని వారంతా జీర్ణించుకోలేకపోయారు.

- 6లో..



మంగళసూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

రమణీయం.. దుర్గానాగేశ్వరుని కల్యాణం

మోపిదేవి, మార్చి 9: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లిలో దుర్గానాగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి కల్యాణం శనివారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 2 గంటలకు స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవాన్ని అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో విశేష అలంకరణ చేసిన సింహవాహనంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను గావించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు, దేవదాయశాఖ తరఫున ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు నూతన పట్టువస్త్రాలను అర్చకులకు అందించారు. ప్రధాన అర్చకుడు బుద్ధు నాగవరప్రసాద్, విజయకుమార్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణాన్ని అత్యంత రమణీయంగా జరిపించారు.

కన్నులపండువగా రథోత్సవం



రథంపై ఊరేగుతున్న స్వామివారు

దుర్గానాగేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు యార్లగడ్డ సత్యజిత్ ప్రసాద్, హరీష్ వరప్రసాద్‌లు ప్రత్యేక పూజలు చేసి స్వామి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రధాన అర్చకులు బుద్ధు నాగప్రసాద్, విజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి తాడులాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు.

కల్యాణ వైభోగమే!

కమనీయం.. ఆదిదంపతుల కల్యాణం

అంగరంగ వైభవంగా సంగమేశ్వరుడి కల్యాణం

నందిగామ రూరల్: మహాశివరాత్రి సందర్భంగా దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై అర్చకుడు దాములూరు శ్రీనివాస్ శర్మ వేదమంత్రోచ్చరణలతో మంగళవాయిద్యాల నడుమ స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివనామ స్మరణ నడుమ వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఆది దంపతుల దివ్య కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఈవో వాసిరెడ్డి భూపాల్, ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం స్వామికి రుద్రహోమం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు.



దాములూరు కూడలిలో సంగమేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

సంప్రదాయబద్ధంగా భవానీ ముక్తేశ్వరుడి కల్యాణం

జగ్గయ్యపేట రూరల్: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ముక్త్యాల గ్రామంలో భవానీ ముక్తేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిచాంచారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్ తరఫున కవితాదత్ స్వామికి పట్టు వస్త్రాలు అందించారు. ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్యాణం అనంతరం అమ్మ, స్వామివారు

తీసుకునేది ప్రభుత్వ జీతం..
చేసేది వైసీపీ సేవ

- గృహసారథుల మండల కన్వీనర్‌గా ఎ.కొండూరు ఐఈఆర్టీ సతీష్
- ప్రత్యేక ఉపాధ్యాయుడి తీరుపై సర్వత్రా విమర్శలు

ఎ.కొండూరు, మార్చి 9: విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు), ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడానికి ప్రభుత్వ జీతం తీసుకుంటున్న ప్రత్యేక ఉపాధ్యాయుడాయన.. కానీ, వైసీపీ ప్రభుత్వమొచ్చినప్పటి నుంచి సీఎం జగన్, వైసీపీ సేవలో తరిస్తుంటారు..ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కంభంపాడుకు చెందిన ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్(ఐఈఆర్టీ) దాసరి సతీష్ తీరిది. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో 50 కుటుంబాలకు ఒక గృహసారథిని నియమించింది. పార్టీకి చేస్తున్న సేవను గుర్తించి గృహసారథుల ఎ.కొండూరు మండల కన్వీనర్‌గా దాసరి సతీష్‌ను వైసీపీ ఎంపిక చేసింది. దీంతో నెల నెలా ప్రభుత్వ జీతం తీసుకుంటూ విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు ప్రత్యేక ఉపాధ్యాయుడిగా నిర్వర్తించాల్సిన తన విధులను పక్కన పెట్టి వైసీపీ కార్యక్రమాల్లో మునిగితేలుతున్నారు. ఇటీవల తిరువూరు నియోజకవర్గ స్థాయిలో ఒక కుల సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించి జగన్ పార్టీకి ఓట్లు వేయాలని ఆయన కోరారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బును ప్రభుత్వ జీతంగా తీసుకుని, వైసీపీ నాయకుడిగా వ్యవహరిస్తున్న ఐఈఆర్టీపై తక్షణం చర్యలు తీసుకోవా లని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను పలు రాజకీయ పార్టీలు కోరుతున్నాయి.



కుల సంఘం ఆత్మీయ సమ్మేళనానికి వైసీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన సతీష్

12 లేదా 13న సీఎం నగర పర్యటన

- ఏర్పాట్లు పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 9: విజయవాడ అర్బన్ పరిధిలో అర్హులైన వారికి నివాస స్థలాలపై పూర్తి హక్కులు కల్పిస్తూ పత్రాలు అందించడం, పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ఈనెల 12 లేదా 13వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నగరంలో పర్యటించనున్నారని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, పోలీసు కమిషనర్ కాంతి రాణా, జేసీ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో సభా వేదిక ఏర్పాటు, వివిధ ప్రాంతాల వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, సభాస్థలి ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించి అధికారులకు ఆదేశాలిచ్చారు. కృష్ణా కరకట్ట రెండు, మూడో దశల రక్షణ గోడలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం చేయనుండడంతో ఆ ప్రాంతాన్నీ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతంలో రిటైనింగ్ వాల్స్, నగర పాలక సంస్థ చేపడుతున్న సుందరీకరణ పనులు పరిశీలించారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

జగన్ ఓటమే లక్ష్యం

- 25 వాహనాలతో రాష్ట్రవ్యాప్తంగా 'కొట్టె' వారి ఎన్నికల ప్రచారం
- టీడీపీ-జనసేన అభ్యర్థుల గెలుపు కోసం స్వచ్ఛందంగా ప్రచారం: జనసేన మచిలీపట్నం నాయకుడు కొట్టె వెంకట్రావు

మచిలీపట్నం టౌన్, మార్చి 9: సీఎం జగన్ ఓటమే లక్ష్యంగా టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అట్లాంటలో నివసిస్తున్న కొట్టె ఉదయభాస్కర్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా పాతిక వాహనాలతో ఎన్నికల ప్రచారం చేస్తున్నామని మునిసిపల్ మాజీ కౌన్సిలర్, జనసేన మచిలీపట్నం నాయకుడు కొట్టె వెంకట్రావు తెలిపారు. కొట్టె ఇంటి పేరుగల వారు 25 ప్రచార రథాలతో ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నారని, టీం నిర్వాహకుడిగా తాను వ్యవహరిస్తానని ఆయన శనివారం మీడియాకు తెలిపారు. ఒక్కో వాహనంలో డ్రైవరుతో పాటు ముగ్గురు ప్రచార సారథులు ప్రచారంలో పాల్గొంటున్నారన్నారు. 25 వాహనాలతో ఫిబ్రవరి 23న బయలుదేరామని, రోజుకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు పర్యటిస్తున్నామని, వందమందితో ప్రచారం సాగుతోందని ఇప్పటివరకు 30 నియోజకవర్గాల్లో ప్రచారం చేశామని, ప్రచారానికి విశేష స్పందన వస్తోందని ఆయన తెలిపారు. భోజనం, పెట్రోలు, బస ఖర్చులు తామే భరించుకుంటూ ఈ ప్రచారయాత్రలో పాల్గొంటున్నామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత తమ తమ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తామన్నారు. రాష్ట్రంలో కొట్టె ఇంటి పేరు గల వారి ఓట్లు లక్ష వరకు ఉన్నాయన్నారు. లక్ష ఓటర్లతో పాటు ఇతర ఓటర్లు కూటమి అభ్యర్థులకు ఓట్లేసేలా ప్రచారం చేస్తున్నామన్నారు. జనసేన-టీడీపీ-బీజేపీ పొత్తు వల్ల వైసీపీ అరాచకాలకు అడ్డువేసేందుకు వీలవుతోందన్నారు. అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి వెళ్లి, జగన్ వల్ల రాష్ట్రం ఎంత నష్టపోయిందో ప్రజలకు ఈ ప్రచారంలో వివరిస్తున్నామన్నారు.



కొట్టె వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రచారానికి బయల్దేరుతున్న వాహనాలు

11 సరుకులు ఏమయ్యాయి జగన్

రేషన్ వ్యానుల్లో ఇచ్చేది బియ్యం, పంచదార, కందిపప్పే

- మరి మిగతావాటి మాటేంటి?..సీఎంను ప్రశ్నించిన షర్మిల
- కొండపల్లిలో మహిళలతో ముఖాముఖి



కొండపల్లిలో ఓ ఇంట్లోకి వెళ్లి మహిళతో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

విజయవాడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తాను అధికారంలోకి వస్తే 11 రకాల నిత్యావసర సరుకులు ఇస్తానన్న జగన్ ఆ హామీని ఏం చేశారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఇప్పుడు రేషన్ వ్యాన్ల ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు మినహా ఏమీ ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో ఇందిరమ్మ అభయం యాప్‌ను ఆమెను శనివారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని విమర్శించారు. ఒకప్పుడు రూ.200 వచ్చే విద్యుత్ బిల్లు ఇప్పుడు రూ.1000 వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పేదలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బొర్రా కిరణ్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలీ, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహరావు, కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు తాంతియాకుమారి, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, జగ్గయ్యపేట ఇన్‌చార్జి కె.అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలు షర్మిల దృష్టికి తెచ్చారు.

పదేళ్లుగా అద్దె ఇంట్లోనే : ప్రియ

మాకు మూడు కుటుంబాలు. మేమంతా అద్దె ఇంట్లో ఉంటున్నాం. మాకు ఎవరూ ఇంటి స్థలం ఇవ్వలేదు.

తాగునీటి కోసం కొట్లాటలే : కాటా రమణ

మాకు తాగునీరు లేదు. 20 ఏళ్లుగా ఇదే సమస్య. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి పైపులైన్ వేయిస్తామని హామీలు ఇస్తారు. తర్వాత వదిలేస్తారు. రాత్రి తొమ్మిది గంటలకు కుళాయిల్లో నీటిని వదులుతారు. నీటికోసం కుళాయిల వద్ద మహిళలు నిత్యం కొట్టుకుంటున్నారు. మాకు తాగునీటి సదుపాయం కల్పించిన పార్టీకే ఓట్లేస్తాం.

లంచం ఇస్తేనే పథకాలు ఇస్తామంటున్నారు : గౌరీ

కొద్దిరోజుల క్రితం మా అమ్మ చనిపోయారు. ఆమెకు రావాల్సిన బీమా డబ్బుల కోసం లంచం ఇస్తేనే దరఖాస్తును ఆన్‌లైన్ చేస్తామంటున్నారు. ఇంటి పట్టా ఇవ్వాలన్నా లంచం అడుగుతున్నారు. డబ్బులు ఇస్తే పనులు చేస్తున్నారు. వలంటీర్ల నుంచి అధికారుల వరకు లంచాలు డిమాండ్ చేస్తున్నారు. స్థలం కోసం రూ.50వేలు నుంచి రూ.లక్ష అడుగుతున్నారు. కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే శవాన్ని అద్దె ఇళ్లలోకి తీసుకు రానివ్వడం లేదు. మా అమ్మ శవాన్ని నడిరోడ్డుపై పెట్టాం. పథకాల్లో అర్హుల పేర్లను తొలగించి డబ్బులిచ్చిన వారి పేర్లను పెడుతున్నారు. డబ్బులడిగిన వారి పేర్లు చెప్తే ఇంటిమీదకొచ్చి గొడవచేస్తారని భయపడుతున్నాం.

ఎన్టీపీసీ సమస్య పరిష్కరించండి: ఎన్టీపీసీ ఉద్యోగులు

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తున్నా ఎన్టీపీసీ ఉద్యోగుల సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఎన్టీపీసీ రాష్ట్ర పరిధిలో ఉంటుందో, సింగరేణి పరిధో, తెలంగాణ పరిధిలో ఉంటుందో బీజేపీ తేల్చడం లేదు. ఇందులో 800 మంది ఉద్యోగులు ఉండేవారు. ఇప్పుడు 100 మందికి ఆ సంఖ్య చేరింది. రాజకీయ పార్టీలు సమస్యను పరిష్కరించడం లేదు. ఈ సంస్థ విభజన చట్టంలో షెడ్యూల్ 9, 10లో ఉంది. ఎన్టీపీసీ నీరు గారిపోతోంది. ఏపీలో ఉద్యోగవిరమణ వయసు 62, తెలంగాణలో 61 ఉంటే, ఈ సంస్థలో ఉద్యోగులకు 58 ఏళ్లే. కాంగ్రెస్ మాత్రమే ఈ సమస్యను పరిష్కరించగలదు.

బూడిద తింటున్నాం: కాలుష్య నియంత్రణ ప్రజా సమితి

ఎన్టీపీసీ కాలుష్యంతో కొండపల్లి పరిధిలోని పది గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక్కడ ప్రజలు, మొక్కలు, జంతువులకు రక్షణ లేదు. బూడిదలో బతుకుతున్నాం. బూడిద తింటున్నాం. ఊపిరితిత్తులు, కిడ్నీ, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నాం. తల ఊడిపోతోంది. మహిళలకు రుతుచక్రం సమయంలో అనేక రుగ్మతలు వస్తున్నాయి. ఒక స్కూల్‌లో 40 మంది విద్యార్థులు ఉంటే 20 మందికి గొంతు సమస్యలు వస్తున్నాయి. ప్రతి నెలా మాకు వైద్య పరీక్షలు చేయాలి. ప్రతి ఇంటికి మొక్కలు నాటి, పెంచాలి. దీని కోసం కాలుష్య నియంత్రణ ప్రజాసమితి ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాం. ఎన్టీపీసీలో మూడేళ్లుగా ఈఎస్పీ మిషన్లు పనిచేయడం లేదు. చివరికి చిక్కుడుపాదు బతకడం లేదు. 40 ఏళ్లకే శుక్లాల ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. రాజకీయనేతలు బూడిదను వ్యాపారానికి వాడుకుంటున్నారు. ఒకప్పుడు రోజుకు 200 ట్రిపులు తిప్పితే ఇప్పుడు 2వేలు తిప్పుతున్నారు.

కరెంట్ కనెక్షన్ అడిగితే హేళనగా మాట్లాడారు : రత్నమౌనిక

టీడీపీ హయాంలో మాకు ఇంటి స్థలం వచ్చింది. దానికి ఇప్పటి వరకు కరెంటు లేదు. కలెక్టర్ వద్దకు 12సార్లు తిరిగాం. ఎలాంటి స్పందన లేదు. కరెంటు ఆఫీసుకు పిలిపించుకుని నన్ను, నా భర్తను హేళనగా మాట్లాడారు. లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. కరెంటు తీసుకునే స్థోమత ఉందా అని హేళన చేశారు. మేం ఇంట్లో లేనప్పుడు ఫొటోలు తీసుకుని ఆన్‌లైన్‌లో పెట్టుకుంటున్నారు. హెల్ప్‌లైన్ నుంచి ఫోన్‌చేసి సమస్య పరిష్కారం అయింది కదా అని అడుగుతున్నారు.

చదువుల తల్లి ఉజ్వల

- కల నెరవేరకుండానే మృత్యు ఒడిలోకి
- ఆస్ట్రేలియాలో ప్రమాదవశాత్తు మృతి చెందిన తెలుగు వైద్యురాలు
- ఎలుకపాడులో అంత్యక్రియలు

గన్నవరం, మార్చి 9: వైద్యురాలిగా రోగులకు సేవలందించాలనే తన కల నెరవేరకుండానే ఆ చదువుల తల్లిని మృత్యువు వెంటాడింది. అప్పటి వరకూ స్నేహితులతో ఆనందంగా గడిపిన ఆమెను మృత్యువు లోయలోకి నెట్టింది. ఎన్నో ఆశలతో వేమూరు వెంకటేశ్వరరావు, మైథిలి దంపతులు రెండు దశాబ్దాల క్రితం ఆస్ట్రేలియా వెళ్లి స్థిరపడ్డారు. వారికి కొడుకు, కుమార్తె. కొడుకు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు ఉజ్వల(24) ఆస్ట్రేలియా గోల్డ్‌కోస్ట్‌లోని బాండ్ విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. పీజీ చేస్తూ రాయల్ బ్రిస్బేన్ ఉమెన్స్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. ఈనెల 2న తోటి స్నేహితులతో కలసి ట్రెక్కింగ్‌కి వెళ్లిన తెలుగు వైద్యురాలు. ఉజ్వల ప్రమాదవశాత్తు కాలు జారి లోయలో పడి ఆస్ట్రేలియాలో అశువులు బాసింది. ప్రమాదం రూపంలో ఉజ్వల మరణం కుటుంబ సభ్యుల జీవితాల్లో చీకటి నింపింది. తల్లిదండ్రులకు, బంధువులకు తీరని విషాదాన్ని మిగిల్చింది. ఉజ్వల పార్థివ దేహాన్ని విమానంలో హైదరాబాద్‌కు, అక్కడ నుంచి అంబులెన్స్‌లో గన్నవరం విద్యానగర్‌లోని ఆమె పెద్దమ్మ, పెదనాన్నలు సావిత్రి, శ్రీనివాసరావు ఇంటికి శనివారం తీసుకొచ్చారు. ఇక్కడకు తీసుకురాగానే కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఎంతో భవిష్యత్ ఉన్న ఉజ్వల మరణం అందరిని ఎంతగానో కలచివేసింది. ప్రముఖ న్యాయవాది కేవీ రమణ, పోతినేని చంద్రశేఖరరావు, నెక్కలపూడి ఈశ్వరరావు, ప్రముఖులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఉంగుటూరు మండలం ఎలుకపాడులోని అమ్మమ్మ, తాతయ్య మూల్పూరు జయలక్ష్మి, రమేష్ ఇంటికి తీసుకువెళ్లి వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఉజ్వల మృతి ఈ ప్రాంతంలోని ఆమె కుటుంబ సభ్యులందరినీ కుంగదీసింది.



ఉజ్వల పార్థివదేహం, రోదిస్తున్న తల్లి మైథిలి

రంజాన్ మాసంలో మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

- సమన్వయ కమిటీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్

కృష్ణలంక, మార్చి 9: రంజాన్ మాసంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. ఈనెల 11న రంజాన్ మాసం ప్రారంభం కానుండడంతో ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా అధికార యంత్రాంగం మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తోందని, మతపెద్దల సూచనలను పరిగణనలోనికి తీసుకున్నామని జేసీ తెలిపారు. మసీదుల వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా బారికేడింగ్, ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రతి మసీదు వద్ద అవసరం మేరకు పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. పెద్ద, చారిత్రక మసీదుల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమైన రోజులు, జాగారం సమయాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు జేసీ తెలిపారు. సమావేశంలో మత పెద్దలు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విజయవాడ, నందిగామ ఆర్డీవోలు బీహెచ్ భవానీశంకర్, ఎ.రవీంద్ర, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షంసున్నీసా బేగం, డీపీవో జయచంద్ర గాంధీ, వీఎంసీ అదనపు కమిషనర్ ఎ.మహేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఎఫ్‌వో ఏవీ శంకరరావు, మతపెద్దలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



సంఘీబావం తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

దగాపడిన దళితుడా మేలుకో

- దళిత శంఖారావంలో కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం టౌన్, మార్చి 9: "వైసీపీ పాలనలో దళితులు దగా పడ్డారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందాల్సిన నిధులు అందలేదు. ఎస్సీలకు సబ్సిడీ రుణాలు ఇస్తానని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన సీఎం జగన్ దగా చేశారు. ఎస్సీలందరూ సంఘటితమై జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలి." అని టీడీపీ-జనసేన మచిలీపట్నం అభ్యర్థి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. శనివారం రాత్రి మచిలీపట్నంలో నిర్వహించిన దళిత శంఖారావం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో దళితులను కిరాతకంగా హింసించారని, దళిత శక్తి ఏమిటో ప్రభుత్వానికి చూపించే తరుణం ఆసన్నమైందని ఆయన తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గంలోని దళితవాడల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించిన ఘనత టీడీపీదేనన్నారు. దళితులను చంద్రబాబు సంపద సృష్టించడంలో దళితులను భాగస్వామ్యం చేశారని, బాలయోగిని లోక్‌సభలో స్పీకర్ చేశారని, టీడీపీ-జనసేన తిరువూరు అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్ అన్నారు. పేర్ని నాని మచిలీపట్నాన్ని తన సొంత ఆదాయపు వనరుగా మార్చుకున్నారని, కొల్లు రవీంద్రపై హత్య కేసు పెట్టించాడని ఆరోపించారు. చంద్రబాబు ఎస్సీల కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశారని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలిచ్చేవారని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. టీడీపీ-జనసేన విజయానికి అందరూ కృషి చేయాలని జనసేన మచిలీపట్నం ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. బురకా బాలాజీ, ఊసా వెంకటేశ్వరరావు, బొడ్డు నాగరాజు, నీలం రామకృష్ణ, చిట్టూరి యువరాజు, దేవరపల్లి అనిత, సాతులూరి నాంచారయ్య, చిన్నం సురేష్, మాచవరపు ఆదినారాయణ, చిన్నం శేఖర్, లింగం విజయ్, గుమ్మడి విద్యాసాగర్, మాదివాడ రాము, వంపుగడల చౌదరి, గడ్డం రాజు, బండి కరుణాకర్ పాల్గొన్నారు.



పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ నాయకులతో కేశినేని చిన్ని

మరో 50 రోజుల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం

- మైనార్టీల అభ్యున్నతికి పనిచేస్తాం
- టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించండి
- పశ్చిమ మైనారిటీ నాయకుల సమావేశంలో కేశినేని చిన్ని

విద్యాధరపురం, మార్చి 9: "మరో 50 రోజులలో టీడీపీ-జనసేన ప్రభుత్వం రాబోతోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యతలు మీరంతా తీసుకోండి. మీకు ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైనా సిద్ధం." అని మైనార్టీ నాయకులతో టీడీపీ విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ నాయకులు, శ్రేణులతో మొగల్రాజపురంలోని తన కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం చిన్ని సమావేశమయ్యారు. మైనార్టీల అభ్యున్నతికి కృషి చేసిన పార్టీ టీడీపీ అని ఆయన అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో షాజహూర్ ముసాఫిర్‌ఖానా, ఉర్దూ కాలేజీలను నిర్మించిందన్నారు. పొత్తుల నేవి రాష్ట్ర భవిష్యత్తు కోసమేనన్నారు. జనసేన-టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చేందుకు అందరు కలిసికట్టుగా పనిచేద్దామని జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్ పిలుపునిచ్చారు. షేక్ కరీముల్లా, మహ్మద్ రజావుల్లా, మహమ్మద్ ఇమ్రాన్, షేక్ ఆషా, అబ్దుల్ సత్తార్, జాహేద్, అన్వార్, రియాజ్, కరీముల్లా, తాజుద్దీన్, బడేషా పాల్గొన్నారు.

వైసీపీ మోసాలు గమనించండి

- టీడీపీ-జనసేన కూటమికి అఖండ విజయం చేకూర్చండి: వెనిగండ్ల రాము

నందివాడ, మార్చి 9: "గ్రామాల అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి చంద్రబాబు సీఎం అయితేనే లభిస్తాయి. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి అఖండ విజయాన్ని చేకూర్చండి. ప్రతీ ఒక్కరూ వైసీపీ ప్రభుత్వ మోసాలను గమనించండి." అని ప్రజలను టీడీపీ-జనసేన గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము కోరారు. శనివారం పోలుకొండలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని పూర్ణ వీరయ్య(బాబ్జీ)తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు.113 ఏళ్ల పిన్నమనేని అనసూర్యవతమ్మ ఆశీర్వాదాన్ని వెనిగండ్ల రాము తీసుకున్నారు. వెనిగండ్ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సి.ఎల్. వెంకట్రావు 70 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.



పోలుకొండలో పర్యటిస్తున్న వెనిగండ్ల, రావి, పిన్నమనేని తదితరులు

వీఆర్ సిద్ధార్థలో నారీ శక్తి-ఫిట్నెస్ రన్



సర్టిఫికెట్లు అందుకున్న విజేతలు

పెనమలూరు, మార్చి 9 : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నెహ్రూ యువజన కేంద్రం సౌజన్యంతో నారీ శక్తి-ఫిట్నెస్ రన్ కార్యక్రమం నిర్వహించారు. 60మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమాన్ని ప్రోగ్రాం కో-ఆర్డినేటరు డాక్టర్ కొల్లా నరేంద్ర, సుంకర రాము పర్యవేక్షించారు.

యువకుడు ఆత్మహత్య

పెనమలూరు, మార్చి 9 : తల్లిదండ్రులు మోటారు సైకిల్ కొనివ్వలేదని మనస్తాపం చెంది ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. తాడిగడప లిబ్రా కాలనీకి చెందిన సయ్యద్ గాలిబ్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు యాకూబ్(19) ఉయ్యూరులోని టైర్ల షాపులో పనిచేస్తుంటాడు. గత నెల రోజులుగా తనకు మోటారు సైకిల్ కొనివ్వమని అడుగుతుండగా డబ్బులు వచ్చిన వెంటనే కొనిస్తామని తల్లిదండ్రులు చెప్తూ వస్తున్నారు. దీంతో మనస్తాపం చెంది తల్లితో గొడవపడి ఇంటిలో ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బొడ్డురాయి ఏర్పాటుకు స్థల పరిశీలన

కంకిపాడు, మార్చి 9 :మండల కేంద్రమైన కంకిపాడులో బొడ్డురాయి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని గ్రామ పెద్దలు తంబాబత్తుల ఓంకారం అన్నారు. గ్రామ పెద్దలు వసంతరావు, బాకి బాబు, కొల్లిపర రాంబాబు, శెట్టి, సుంకర శివ, తాతా రావులతో కలిసి బొడ్డురాయి ఏర్పాటు స్థలాన్ని శనివారం పరిశీలించారు. బొడ్డురాయి ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్య లపై ఆదివారం కంకిపాడులోని ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశామని, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం అందజేత

ముదునూరు(ఉయ్యూరు), మార్చి 9 : సొసైటీలు రైతు సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తూ వారికి అండగా ఉంటున్నాయని ముదునూరు సొసైటీ ఛైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ అన్నారు. ముదునూరు పీఏసీఎస్ సభ్యుడు కనుమూరి వెంకట గాంధీ కిషోర్ ఇటీవల మరణించగా, అతని కుటుంబానికి సంఘం నిధుల నుంచి రూ. 10వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు. సంఘ సీఈఓ తుమ్మల శ్రీనివాసరావు, చింతా జితేంద్ర, కేశవులు, పాపారావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు!

- ప్రధాన కూడళ్లలో రోడ్డుకు అడ్డుగా ఫ్లెక్సీల ఏర్పాటు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక తరచూ ప్రమాదాలు
- తొలగించేందుకు ధైర్యం చేయని పంచాయతీ అధికారులు, పోలీసులు



గోసాల సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు

గోసాల (కంకిపాడు), మార్చి 9 : ఫ్లెక్సీల ఏర్పాటులో అధికార పార్టీ నాయకులకు అడ్డుఅదుపు లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పందించాల్సిన పంచాయతీ, పోలీసు అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పెనమలూరు మండలం గోసాల సెంటర్‌లోని ప్రధాన కూడలిలో అధికార పార్టీకి చెందిన నాయకులు భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గోసాల, వణుకూరు, మద్దూరు, కాసరనేని వారి పాలెం గ్రామాల నుంచి బందరు రోడ్డు ఎక్కే ప్రధాన రహదారిపై నుంచి బందరు రోడ్డు ఎక్కేందుకు ప్రధాన కూడలిలో ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఆయా గ్రామాల నుంచి బందరు రోడ్డు ఎక్కాలంటే కంకిపాడు వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించవు. ఫ్లెక్సీలు అడ్డుగా ఉంటాయి. కంకిపాడు వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికార పార్టీ నాయకులకు చెందిన ఫ్లెక్సీలు కావడంతో అటు అధికారులు, ఇటు పోలీసులు ఆ ఫ్లెక్సీ లు తొలగించేందుకు ధైర్యం చేయడం లేదు. భారీ ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరగకముందే అధికారులు ఫ్లెక్సీలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం

పెనమలూరు, మార్చి 9 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామి, పార్వతీదేవి గ్రామోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున శ్రీరామలింగేశ్వరస్వామి దంపతుల కల్యాణం అనంతరం జరిగిన ఈ కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రాత్రి ఎనిమిది గంటలకు బలిహరణ కార్యక్రమంతో శనివారం నాటి కార్యక్రమాలు ముగిశాయి. ఆదివారం ఉదయం తొమ్మిదింటికి పుణ్య దంపతుల వసంతోత్సవం వైభవంగా జరగనుంది. అనంతరం పవిత్ర కృష్ణానదిలో త్రిశూల స్నానానంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. రాత్రి ఏడు గంటలకు ధ్వజావరోహణ, మూగబలి, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, సంకీర్తన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

వీరవల్లి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న ఎంటీ కృష్ణబాబు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 9 : వీరవల్లిలోని పీహెచ్‌సీని వైద్య, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయితో కలసి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న వైద్యసేవల గురించి, ఇంటింటికీ సర్వే, తదితర విషయాలను గురించి డాక్టర్ కిరణ్మయిని అడిగి తెలుకున్నారు. ఏఎన్ఎం, పీహెచ్‌సీకి సంబంధించిన ఆన్‌లైన్ యాప్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిసరాలతో పాటు ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ప్రసూతి విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్లు, సచివాలయాల్లో ఆరోగ్య సిబ్బంది నిర్ణీత సమయానికి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూడీసీ సురేంద్ర, హెచ్‌వీ మంగతాయారు, పండు, హెచ్ఎస్ ప్రదీప్‌సన్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీను, ఫార్మసిస్ట్ త్రివేణి, అనురాధ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రముఖులు గూడవల్లి సుధాకర్, మూల్పూరు ప్రభుకాంత్, మోర్ల ఆంజనేయులు, గండి చిన్నారావు, ఆత్కూరి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ పెనమలూరు ఇన్‌చార్జి బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్

ముదునూరు(ఉయ్యూరు), మార్చి 9 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరుగ్యారెంటీలు, జనసేనతో కలసి ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో ఆయా వర్గాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ అన్నారు. ముదునూరులో శనివారం పర్యటించి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించి తెలుగుదేశం, జనసేన పార్టీల సంయుక్త ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధి, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం తెలియజేశారు. ఎమ్మెల్యేగా తన తండ్రి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తుచేసి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు అజయ్ బాబు, మొవ్వ జ్ఞానశేఖర్, మాజీ సర్పంచ్ పి శ్రీనివాసరావు, పాలడుగు బాలాజీ, తుమ్మల రామకోటయ్య, నారాయణ, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు సంగేపు రంగా రావు, నియోజకవర్గ స్పోక్స్‌పర్సన్ పాలడుగు మాధవీలత, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అన్ని వర్గాల సంక్షేమం..

హనుమాన్‌జంక్షన్ : అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాడుపడే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని రానున్న ఎన్నికల్లో బలపర్చాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక నూజివీడు రోడ్డులో జంక్షన్ పట్టణ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను దుకాణాల్లో పంపిణీ చేస్తూ ప్రచారం సాగించారు. టీడీపీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని నాయకులు కోరారు. యార్లగడ్డ వెంకట్రావు అభ్యర్థిత్వాన్ని బలపర్చి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, జిల్లా అధికార ప్రతినిధి వడ్డిల్లి లక్ష్మి, పట్టణ కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు, కాకుల శ్రీను, యార్లగడ్డ సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు, వీర మహిళలు శిరీష, జయరాణి, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ పథకాలపై ముదునూరులో ప్రచారం చేస్తున్న బోడె వెంకట్రామ్



హనుమాన్‌జంక్షన్‌లో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నవరం, మార్చి 9 : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8నుంచి 11గంటల వరకూ గన్నవరం, మర్లపాలెం, చిన అవుటపల్లి, దావాజీగూడెం, అల్లాపురం, రాజీవ్‌నగర్ కాలనీ, దుర్గాపురం, విమానాశ్రయం, బీబీగూడెం, గొల్లనపల్లి, చిక్కవరం, గోపవరపు గూడెం గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలువురికి యార్లగడ్డ ఆర్థిక సాయం

గన్నవరం /విజయవాడ రూరల్, మార్చి 9 : మండలంలోని ముస్తాబాద గ్రామానికి చెందిన దూళ్ల పెద సీతారామయ్య, పొనుగుమాటి ప్రకాశరావు మృతి చెందగా ఆ కుటుంబాలకు టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు పంపిన నగదు రూ.20వేలను శనివారం ఆయా కుటుంబ సభ్యులకు రూ.10వేల చొప్పున పార్టీ నాయకులు అందజేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు పాలడుగు మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి బోడ పాటి రవికుమార్, గ్రామ కార్యదర్శి మేడేపల్లి కాంతారావు, రమాదేవి, షేక్ అబుల్యాజ్, పల్లి కార్తీక్, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. తెంపల్లికి చెందిన పంపు చంటి అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు సర్నాల బాలాజీ రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అంబాపురం గ్రామానికి చెందిన ఏలూరి నాగరాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న యార్లగడ్డ ఆ కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థికసాయం పంపించారు. గ్రామంలోని సిద్దిల జోతిర్మయి కేన్సర్‌తో బాధపడుతూ మృతి చెందాగా ఆమె కుటుంబానికి మరో రూ. 10 వేలు, కుందేటి చిట్టిబాబుకు రూ. 10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గొడ్డళ్ల చిన్నరామారావు, సత్యనారాయణ, రాజశేఖర్, కవిలి రాజు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

లబ్ధిపేరుతో వలంటీర్ల జిమ్మిక్కులు

ఉయ్యూరు, మార్చి 9 : లబ్ధిపేరుతో వలంటీర్లు జిమ్మిక్కులు ప్రారంభించారు. పొందిన లబ్ధి వివరాలతో కూడిన కరపత్రాలు వలంటీర్లు పంపిణీ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఎవరెవరికి ఎంత లబ్ధి చేకూరిందో వివరాలతో కూడిన కరపత్రాలు ఉయ్యూరులో వార్డు సచివాలయాలనుంచి సేకరించిన వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారు పొందిన లబ్ధిని కరపత్రాల ద్వారా పంపిణీ చేస్తూ, వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలంటూ కోరుతున్నారు.

టీడీపీ యువనేత నరేంద్ర మృతి తీరనిలోటు

హనుమాన్‌జంక్షన్, మార్చి 9 : అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన బాపులపాడు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు కసుకుర్తి నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను టీడీపీ బాపులపాడు మండల నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు దయాల రాజేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, పుట్టా సురేష్, అట్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, నరేంద్ర మృతి టీడీపీకి తీరనిలోటన్నారు. కనిగంటి రాధాకృష్ణ, కూచిపూడి వెంకటేశ్వరరావు, గుత్తా శ్రీనివాసరావు, రంగన్నగూడెం టీడీపీ నాయకులు కసుకుర్తి కృష్ణకిషోర్ పరామర్శించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఉంగుటూరు, మార్చి 9 : ప్రకృతి సమతుల్యతను కాపాడటం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ కమిటీ (ఏపీఎన్‌జీసీ) స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభ పేర్కొన్నారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్(ఏపీఎన్‌జీసీ)ప్రతినిధుల బృందం పెదఅవుటపల్లిలోని శ్రీసాయి శ్రీనివాసా, సెయింట్‌జార్జి, శ్రీగణేష్ హైస్కూళ్లను శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, గ్రీన్‌కోర్ అనే అంశంపై ఆయా పాఠశాలల్లో పదవతరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తులు

కంకిపాడు, మార్చి 9 : రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన పార్టీలు బీజెపీతో పొత్తు పెట్టుకున్నాయని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మాజీ ఛైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవడం హర్షణీయమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో రాజధాని అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం పూర్తి పూర్తి చేసుకునేందుకు అవకాశముంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 126, 137
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33



కూచిపూడి నృత్య పోటీలకు విశేష స్పందన

గుడివాడ : మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి బంటుమిల్లి రోడ్డు వీరాంజనేయ స్వామి దేవస్థానంలో అరుణాచలేశ్వర నాట్యనిలయం మూడో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల విశేష స్పందన లభించింది. పోటీల్లో 25 మంది బాలబాలికలు ప్రదర్శనలిచ్చారు. విజేతలకు బ్రహ్మ కుమారి, రాజయోగ మెడిటేషన్ ట్రైనీ ఉపాధ్యాయురాలు శైలజ, న్యాయవాది వై.విజయ భాస్కర్ బహుమతులు అందజేశారు.



చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మాట్లాడుతున్న కొనకళ్ల, కొల్లు



కోసూరు పల్లెబాటలో వర్లకుమార్ రాజా



నాగేశ్వరరావుపేటలో బాబు ష్యూరిటీలో కాగిత కృష్ణప్రసాద్



ముచ్చిలిగుంటలో కాగిత శిరీష ప్రచారం

చంద్రబాబు, పవన్‌లకు ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం

● కొల్లు, కొనకళ్ల ఉద్ఘాటన

మచిలీపట్నం టౌన్, మార్చి 9 : మంగళగిరి వేదికపై బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీసీల హృదయాల్లో ప్రత్యేక స్థానం పొందారని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పేర్కొన్నారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు శనివారం రాత్రి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తున్నామన్నారు. కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు మళ్లీ 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. చంద్రన్న బీమాను రూ.10 లక్షల వరకు పెంచుతామని, పెళ్లి కానుకలు తీసుకుని వస్తామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసుబాబు, గోకుల శివ, గోపు సత్యనారాయణ, రామధేని వేణు, జనసేన నాయకుడు గడ్డం రాజు తదితరులు మాట్లాడారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

మచిలీపట్నం టౌన్ : టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో దివ్యాంగుల పింఛను రూ.6వేలకు పెంచే అంశం చేర్చాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావులకు దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, కార్యదర్శి ఎన్. సత్యనారాయణరావు వినతిపత్రం సమర్పించారు.

మౌలిక సదుపాయాల కల్పనలో కొడాలి నాని విఫలం : వెనిగండ్ల

గుడివాడ : మౌలిక వసతులు కల్పించడంలోనూ ఎమ్మెల్యే కొడాలి నాని విఫలమయ్యాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, వెనిగండ్ల రాము విమర్శించారు. వెనిగండ్ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం 1, 36 వార్డుల్లో శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, పోలాసి ఉమామహేశ్వరరావు, మెరుగుమాల బ్రహ్మయ్య, గొరిపర్తి శ్రీను, గొర్ల శ్రీలక్ష్మి, అసిలేటి నిర్మల, గుండిమెడ రాఘవేంద్రరావు, మాగంటి పిచ్చయ్య, లోయ విజయ్, సురేష్, కొలుసు సతీష్, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, దాసు శ్యామ్‌ప్రసాద్, డి.చిన్ని, కంచర్ల చంటి, చిటికెల నాగేశ్వరరావు, దాసు చిరంజీవి, సోహైల్, పెద్దపూడి దుర్గారావు, నరేంద్ర, కరుణకుమారి, సాయిబాబు, కలపాల చక్రవర్తి, గోవాడ శ్రీను, గోవాడ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో వృద్ధురాలితో ఆత్మీయంగా మాట్లాడుతున్న వెనిగండ్ల రాము

పల్లెసీమలను అభివృద్ధి చేస్తాం : కుమార్ రాజా

కూచిపూడి : వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పల్లెసీమల అభివృద్ధికి నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పల్లెబాటలో భాగంగా శనివారం కోసూరు గ్రామంలో పర్యటించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరించటంతోపాటు గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాసు, కిలారపు మంగమ్మ, తాతా నారాయణరావు, చౌటపల్లి వాసు, వెంకటేశ్వరరావు, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ, జనసేన ఐక్యపోరాటం : కాగిత

బంటుమిల్లి, మార్చి 9 : వైసీపీ దుష్టపాలనకు చరమగీతం పాడేందుకు, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టీడీపీ, జనసేన పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని పెడన నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బంటుమిల్లి టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు అధ్యక్షతన టీడీపీ జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. చిన్న, చిన్న విషయాలు పట్టించుకోకుండా అందరూ కలిసి పోరాడదామన్నారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ పంచకర్ల సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో దొంగల రాజ్యాన్ని అంతమొందించాలన్నారు. మచ్చలేని కాగిత కృష్ణప్రసాద్ గెలుపు కోసం సైనికుల్లా పోరాటం చేయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, సర్పంచ్‌లు దింటకుర్తి మధుసూదనరావు, రేవు గోపాలకృష్ణ, ఇల్లూరి లీలాకృష్ణ, బొర్రా కాశీ, బందారు నాగచంద్ర, మట్టా బ్రహ్మం, జొన్నలగడ్డ కొండ, దాసరి కరుణజ్యోతి, ర్యాలీ సత్యనారాయణ, పాశం నాగమల్లేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుపేట, ముచ్చిలిగుంటలో కాగిత దంపతుల ప్రచారం

బంటుమిల్లి : నాగేశ్వరరావుపేట గ్రామంలో శనివారం సూపర్ సిక్స్ పథకాలను టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ప్రజలకు వివరించారు. మండల పార్టీ కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి టీడీపీ మేనిఫెస్టో వివరించారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్ :** వైసీపీ అరాచకపు పాలనను అంతమొందిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి కాగిత శిరీష అన్నారు. ముచ్చిలిగుంటలో మండల పార్టీ నాయకులతో కలిసి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, కాగిత నాగబాబు, కరుణజ్యోతి, కృష్ణ, స్వరూపరాణి, కాగిత వాసు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాగితకు ఉరివి జనసేన నాయకుల మద్దతు

పెడన రూరల్ : ఉరివి జనసేన నాయకులు ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌కు మద్దతు తెలిపారు. మండల పార్టీ నాయకుల సూచన మేరకు గ్రామ టీడీపీ అధ్యక్షుడు గంధం గోపాలకృష్ణ ఉరివి జనసేన నాయకులు గంధం వెంకటేశ్వరరావు, వాసన నాగరాజు, బావిరెడ్డి నరేంద్ర, దొండపాటి శ్రీనులతో మాట్లాడి రానున్న ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు. శనివారం కాగిత కృష్ణప్రసాద్ ఇంటికి వెళ్లి తమ మద్దతు తెలిపారు.

పామర్రులో కేంద్ర బలగాల కవాతు

పామర్రు : గ్రామాల్లో మత విద్వేషాలు, కుల ఘర్షణలకు తావివ్వకుండా అందరూ ఐకమత్యంగా సోదర భావంతో మెలగాలని పామర్రు సీఐ శుభాకర్ సూచించారు. పామర్రు పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం కేంద్ర దళాలతో కలిసి ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా రాజకీయ పార్టీ నేతలు, కార్యకర్తలు, సంయమనంతో వ్యవహరించాలని కోరారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ లక్మేందర్‌సింగ్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. సీఐఎస్ఫ్ ఎస్సైలు అనురాగ్ కౌశిక్, ప్రవీణ్ నాయక్, పామర్రు ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి నేతృత్వం వహించారు.



బండి రామకృష్ణ సేవలు స్ఫూర్తిదాయకం

● దివ్యాంగుడికి రూ.20 వేలతో ఇంటర్నెట్ పరికరాలు

మచిలీపట్నం టౌన్, మార్చి 9 : విభిన్న ప్రతిభావంతుల సేవ దైవసేవతో సమానమని జనసేన రాష్ట్ర ఐటీ టీం ప్రతినిధి మిరియాల శ్రీనివాసరావు అన్నారు. హుస్సేన్‌పాలెంకు చెందిన దివ్యాంగుడు పాండు ఇంటర్నెట్ కేంద్రం నడుపుకునేందుకు రూ.20 వేలతో కొనుగోలు చేసిన పరికరాలను జనసేన నియోజిక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అందజేశారు. మిరియాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2019 నుంచి ఇప్పటి వరకు బండి రామకృష్ణ దాదాపు 600 సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శప్రాయుడయ్యారన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, నాయకులు కూనపరెడ్డి ప్రసాద్, ఉడుముల బుజ్జి, తిరుమలశెట్టి రాజు, బండి కరణాకర్, కోలపల్లి గణేష్, బడే లోకేష్, కొండిశెట్టి హర్ష, నూకల సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



నేత్రపర్వంగా సంగమేశ్వరస్వామి కల్యాణం

నాగాయలంక : సంగమేశ్వరంలో గంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. అర్చకులు కొల్లిపర శివసాయి తిరుమల భార్గవ్, సుబ్బారావు అర్చకత్వంలో ఉత్సవ మూర్తులను పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెగా పట్టు వస్త్రాలతో అలకరించారు. మంగళ వాయిద్యాలతో వధూవరులను కళ్యాణ మండపం వద్దకు తీసుకొని వేద మంత్రాల పఠనం నడుమ వివాహాన్ని వేడుకగా జరిగింది. అనంతరం భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో సిహెచ్.సుధాకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.




బ్రహ్మేంద్రస్వామికి బంగారు పూత కిరీటాలు

నాగాయలంక : విశ్వేశ్వరస్వామి సహిత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో మూలవిరాట్‌లకు హైదరాబాద్‌కు చెందిన మానేపల్లి సత్యనారాయణ, వరకుమారి దంపతులు బంగారు తాపడంతో చేసిన కిరీటాలు, వడ్డాణం ఆలయ ధర్మకర్త భవిరి సుధాకర్, అర్చకులు మహేశ్వరపు శ్రీనివాస్ గాంధీలకు అందజేశారు. కిరీట దాతలను, తయారు చేసిన తెనాలికి చెందిన శిల్పి దేవు మయాచార్యులను ఆలయ యాజమాన్యం, వీరబ్రహ్మేంద్ర ప్రచార పరిషత్ అధ్యక్షులు భవిరి రవి, కోశాధికారి శంకర్‌నాథ్ ఘనంగా సత్కరించారు. భవిరి శివరామకృష్ణ ప్రసాద్, సుధాకర్, వేణు దంపతులు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా హమీదుల్లా

పెడన : టీడీపీ ముస్లిం మైనారిటీ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా సీనియర్ టీడీపీ నాయకుడు మహమ్మద్ హమీదుల్లా నియమితులయ్యారు. కాగిత కృష్ణప్రసాద్, వేణుగోపాలరావులకు కృతజ్ఞతలు తెలిపారు.





గుడివాడ ఏరియా వైద్యశాలలోని డాక్టర్లు, వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న ఇందిరాదేవి



పెడనలో టీచర్లను సత్కరిస్తున్న యూటీఎఫ్ నేత ఉమామహేశ్వరరావు

వైద్య సిబ్బంది, టీచర్లకు ఘన సత్కారం

గుడివాడ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం అన్నే పుష్పలీలావతి, నరసింహారావు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బందిని ఆసుపత్రి సూపరిటెండెంట్ ఇందిరా దేవి ఘనంగా సత్కరించారు. బేతవోలులోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయం, విశ్వకర్మ మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాహితీ వేత్త, యోగా గురువు పులవర్తి వెంకట సూర్య కుమారిని ఘనంగా సత్కరించి వృద్ధులకు చీరలు, నిత్యావసర వస్తువులు, పౌష్టికాహారాన్ని అందజేశారు. **పెడన :** మహిళా దినోత్సవం సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో 10 మంది టీచర్లను ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ నాయకులు ఉమామహేశ్వరరావు, లెనిన్‌బాబు, ఝాన్సీ, నాగేశ్వరరావు, రంగనాథ్, పాపయ్య పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి జనసేన నేతల సాయం

కోడూరు : యారారెడ్డివారిపాలెం హోటల్ దగ్ధమై నష్టపోయిన కోట నాగ శ్రీను - వెంకటేశ్వరమ్మ దంపతులకు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబసభ్యులకు స్థానిక టీడీపీ, జనసేన నేతలు ఈ మొత్తాన్ని అందజేశారు.

జనసేన పార్టీ నాయకులు, అక్షయ డెవలపర్స్ అధినేత మాదివాడ వెంకట కృష్ణ మరో రూ.10 వేల ఆర్థిక సాయమందించారు. ప్రముఖ వ్యాపారి కోట వెంకటేశ్వరరావు రూ.5వేలు సాయమందించారు. మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య, కోట రాంబాబు, కొండవీటి సునీత, దుడ్డు మురళీ, తోట దామోదర్‌రావు, ముళ్లపూడి బసవయ్య, బొప్పన వేణు, బండే వెంకటేశ్వరరావు, కోట ప్రసాద్, రేపల్లె మహేష్, అల్లంశెట్టి రాజేంద్ర ప్రసాద్, అలుమూడి సురేష్, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, కటారి శ్రీనివాసరావు, కటారి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల లబ్ధిదారులు తరలిరావాలి

గుడివాడ : టీడీపీ హయాంలో నిర్మించిన 8912 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు విమర్శించారు. ఏలూరురోడ్డులోని ప్రజావేదిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల కేటాయింపులో వైసీపీ నాయకులు చేతివాటం చూపించారన్నారు. కొందరి ఫ్లాట్‌లను మార్చారని, మరికొంద మందికి వయస్సు పెరిగిందని, విద్యుత్ బిల్లుల సాకులను చూపి ఇళ్లను కేటాయించలేదన్నారు. ఈ నెల 10వ తేదీ ఆదివారం వెనిగండ్ల, రావి ఆధ్వర్యంలో టిడ్కో గృహాలను పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తెలిపారు. టిడ్కో గృహాలు అందని లబ్ధిదారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. దింట్యాల రాంబాబు, శొంఠి రామకృష్ణ, వసంతవాడ దుర్గారావు, నాయకులు మెరుగు మోజెస్, మజ్జాడ నాగరాజు, గడ్డం ప్రకాష్‌దాసు, ఆదినారాయణ, షేక్ సర్కార్ పాల్గొన్నారు.

బాలికను మోసగించిన కేసులో నిందితుడి అరెస్టు

పెడన : బాలికను నమ్మించి మోసగించిన కేసు లో నిందితుడు పామర్తి ప్రభ కుమార్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. నందిగామ గ్రామానికి చెందిన ప్రభుకుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో లోబరచుకుని గర్భ వతిని చేశాడు. పెళ్లికి నిరాకరిండంతో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసు కుంది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సూర్యశ్రీనివాస్ శనివారం ప్రభు కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు అం కాలరావు, రేణుకాదేవిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

శివారాధనలో అద్వైత తత్వం

మచిలీపట్నం టౌన్ : శివారాధనలో అద్వైత తత్వం ఉందని మచిలీపట్నం శైవమహాపీఠం గౌరవాధ్యక్షుడు సింగరాజు గోవర్ధన్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం వివేకానంద మందిరంలో పరమశివునికి నమక చమకాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠం అధ్యక్షుడు మల్లంపల్లి నాగలింగశాస్త్రి సభకు అధ్యక్షత వహించారు. శివతత్వంపై మల్లంపల్లి రవికుమార్, చాగంటి బాలసుబ్రహ్మణ్యం, వడ్లమన్నాడు ప్రభాజీ, శివలెంక శ్రీనగేష్, కె. నాగేశ్వరరావు, మల్లంపల్లి వాసు తదితరులు ప్రసంగించారు. శివగీతాలను ఆలపించారు.

200 మందికి అన్నదానం

అవనిగడ్డ రూరల్ : నిరుపేదల ఆకలి తీర్చిన డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అవనిగడ్డలో 200 మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. మా దాసు నారాయణ కుమార్తె మాదాసు లేఖ పుట్టిన రోజు సందర్భంగా వారిచ్చిన ఆర్థిక సాయంతో 200 మందికి అన్నదానం జరిగింది. గరికపాటి రామ్, వివేక్, మిత్ర బృందం ఏర్పాట్లు పరిశీలించారు.



కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ల నియామకం

మచిలీపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా సోషల్ మీడియా విభాగం కో-ఆర్డినేటర్లను నియమిస్తూ ఏపీ కాంగ్రెస్‌పార్టీ సోషల్ మీడియా విభాగం ఛైర్‌పర్సన్ రాకేష్ కొట్టి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణాజిల్లా సోషల్ మీడి యా కో-ఆర్డినేటర్‌గా కోకా ఫణిభూషణ్, కో-కోఆర్డినేటర్‌గా నల్లబ్రోలు శామ్యూల్‌ను నియమించారు.

శ్యామ్ కిషోర్ ఆర్థిక సాయం

మోపిదేవి : కె.కొత్తపాలెం గ్రామానికి చెం దిన మామిళ్ల చిరంజీవి ప్రమాదవశాత్తు గాయపడగా, చికిత్స నిమిత్తం అవనిగడ్డకు చెందిన తోట శ్యామ్ కిషోర్ నాయుడు రూ.5 వేల ఆర్థిక సాయమందించారు. కె.కొత్తపాలెం వెళ్లి శనివారం బాధితుడిని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం నగదు అందజేశారు. సర్పంచ్ మాధవీ, చందన రంగారావు తదితరులు ఉన్నారు.

మొవ్వలో అభివృద్ధి పనులు ప్రారంభం

కూచిపూడి : పామర్రు ఎమ్మెల్యే అనిల్ కుమార్ శనివారం మొవ్వలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సీసీ రహదారులతోపాటు నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ చేయూత నాల్గో విడత చెక్కును అందజేశారు. ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతీ, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, గ్రామసర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ వైద్యశిబిరం నేడు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు లయన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మధుమేహ చికిత్సా శిబిరం నిర్వహించనున్నట్లు శిబిర కో-ఆర్డినేటర్ మూల్పూరి సుధాకర్ తెలిపారు. గుడివాడకు చెందిన ప్రముఖ డాక్టర్ గవిర్నేని రజని వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.